సూర్య నేటి దినపత్రిక
www.suryaa.com
17వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
బుధవారం
05 జూన్ 2024
పేజీలు: 02



## పిల్లల కంటి ఆసుపత్రిలో భారీ అగ్నిప్రమాదం

దేశరాజధాని ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పిల్లల కంటి ఆసుపత్రిలో బుధవారం ఉదయం పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. లజ్‌పత్ నగర్‌లోని ఐ 7 చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో ఈ ఘటన జరిగింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. సుమారు 12 ఫైరింజన్ల సాయంతో మంటలను అదుపుచేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

## సాయంత్రం ఇండియా కూటమి భేటీ

పార్లమెంట్ ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు సాధించిన ఇండియా కూటమి నేతలు ఇవాళ ఢిల్లీలో భేటీ కానున్నారు. సాయంత్రం 6 గంటలకు ఎఐసీసీ చీఫ్ ఖర్గే నివాసంలో ఈ సమావేశం జరగనుంది. ఎన్నికల ఫలితాలపై నేతలు సమీక్షించనున్నారు. తాజా ఫలితాల్లో ఇండియా కూటమి 234 సీట్లలో విజయం సాధించింది. కాంగ్రెస్ 99 సీట్లలో గెలిచింది. కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు కూటమి బయట పార్టీలను కూడా ఆహ్వానించే విషయంపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది.





## జగన్ సభలకు పోటెత్తిన జనం.. అయినా అంతుచిక్కని ఫలితం!

ఏపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వైసీపీ నిర్వహించిన సిద్ధం సభలకు లక్షల సంఖ్యలో జనం ఉప్పెనలా వచ్చారు. జగన్ బస్సుయాత్రలోనూ పోటెత్తారు. ఆ తర్వాత ప్రచార సభలకూ బ్రహ్మరథం పట్టారు. ఫలితాల్లో మాత్రం 11 ఎమ్మెల్యే, 4 ఎంపీ సీట్లతో వైసీపీకి ఘోర ఓటమిని కట్టబెట్టారు. రాయలసీమలోని వైసీపీ కంచుకోటలనూ కూటమి బద్దలుకొట్టింది. తమ ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత ఉందా? అనేలా అంతుచిక్కని ఫలితాలు రావడంతో వైసీపీ శ్రేణుల్లో తీవ్ర నైరాశ్యం నెలకొంది.



## 8న ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారం

నరేంద్ర మోదీ ప్రమాణస్వీకారానికి ముహూర్తం ఖరారయింది. మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కర్తవ్యపథ్ లో ఈ నెల 8వ తేదీన ఆయన ప్రమాణ స్వీకారం చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు కొద్దిసేపటి క్రితం జరిగిన మంత్రి వర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎన్డీఏ పక్షాలతో కలసి... సాయంత్రం ఎన్డీఏ పక్షాలతో కలసి రాష్ట్రపతిని కలవనున్నారు. మూడోసారి ప్రధానిగా మోదీ ప్రమాణం చేయడానికి సిద్ధమవుతున్నారు.



## అహంకారం నెత్తికెక్కితే 151 సీట్లు 11 అయ్యాయి: లోకేశ్

అహంకారం నెత్తికెక్కి ప్రవర్తిస్తే 151 సీట్లు 11 అయ్యాయని వైసీపీ నేతలను నారా లోకేశ్ విమర్శించారు. గెలిచిన టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులతో ఆయన సమావేశం నిర్వహించి మట్లాడారు. ప్రజలు మనపై పెద్ద భాధ్యత పెట్టారు. వారి నమ్మకాన్ని వొమ్ము చేయకుండా కాపాడాలి. పాదయాత్రలో వచ్చిన ప్రతి సమస్య నెరవేర్చాల్సిన బాధ్యత నాపై ఉంది. కర్నూలులో వలసలు నివారించాలి. పల్నాడు, ప్రకాశం తదితర ప్రాంతాల్లో నీటి ఎద్దడి నివారించాలి అని లోకేశ్ ఆదేశించారు.



## పద్మనాభరెడ్డిగా మారనున్న ముద్రగడ!

పేరు మార్చుకునేందుకు సిద్ధమయ్యారు ముద్రగడ పద్మనాభం. ముద్రగడ పద్మనాభం సంచలన నిర్ణయం తీసుకున్నారు. పిఠాపురం లో పవన్ కళ్యాణ్ గెలిస్తే.. పేరు మార్చుకుంటానని సవాల్ విసిరి.. ఇప్పుడు పేరు మార్చుకునేందుకు సిద్ధమయ్యారు ముద్రగడ పద్మనాభం. నా పేరు పద్మనాభ రెడ్డి గా మార్చమని గెజిట్ పబ్లికేషన్ కోసం పేపర్లు రెడీ చేసుకున్నానని ప్రకటించారు. సవాలులో నేను ఓడిపోయాను కాబట్టి నా పేరు మార్చుకోవడానికి సిద్ధమవుతున్నాను అంటూ వ్యాఖ్యానించారు ముద్రగడ పద్మనాభం. జగన్ కోసం కష్టపడ్డాను.... జగన్ ను గౌరవించకపోవడం బాధాకరం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు ముద్రగడ పద్మనాభం. నా రాజకీయ ప్రయాణం జగన్ తోనే కొనసాగుతుంది... జగన్ సంక్షేమ కార్యక్రమాలను ఎందుకు ఆదరించలేదో తెలియడం లేదని వివరించారు. కూటమికి నా శుభాకాంక్షలు అంటూ వ్యాఖ్యానించారు ముద్రగడ పద్మనాభం.

## జగన్ ప్రభుత్వంపై ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు

తెలంగాణ మాదిరి ఏపీలోనూ ఫోన్ ట్యాపింగ్ జరిగిందని టీడీపీ నేత డొక్కా మాణిక్యవరప్రసాద్ సంచలన ఆరోపణలు చేశారు. 'సజ్జల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రముఖ నాయకుల ఫోన్ ట్యాపింగ్ జరిగింది. ప్రజాప్రతినిధుల ఫోన్లు, వారి వ్యక్తిగత సంభాషణలు రికార్డు చేశారు. ఫోన్ ట్యాపింగ్ ఆధారంగానే జగన్ ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడింది. దీనిపై విచారణ జరపాలి' అని డిమాండ్ చేశారు.



## లాభాల్లో స్టాక్ మార్కెట్

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం లాభాలతో ప్రారంభమయ్యాయి. మంగళవారం నాటి రికార్డు నష్టాల నేపథ్యంలో ఆరంభంలో కొనుగోళ్లు కనిపిస్తున్నాయి. మధ్యలో కాసేపు నష్టాల్లోకి జారుకున్నప్పటికీ తిరిగి కోలుకున్నాయి. ఉదయం 9:30 గంటల సమయంలో సెన్సెక్స్ 529 పాయింట్ల లాభంతో 72,609 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 153 పాయింట్లు పుంజుకొని 22,037 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.46 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో హెచ్‌యూఎల్, నెస్లే ఇండియా, హెచ్‌సీఎల్ టెక్, ఏషియన్ పెయింట్స్, ఎం అండ్ ఎం, ఐటీసీ, మారుతీ, ఇన్ఫోసిస్, కోటక్ మహీంద్రా బ్యాంక్, టాటా స్టీల్, విప్రో, టెక్ మహీంద్రా షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఎల్ అండ్ టీ, పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ, భారతీ ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, టైటన్, యాక్సిస్ బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి.

### కొనసాగుతున్న గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల

# ఓట్ల లెక్కింపు..

### తుది ఫలితం రావడానికి దాదాపు 36 గంటల సమయం పట్టే అవకాశం



'వరంగల్-ఖమ్మం-నల్గొండ' పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు కొనసాగుతున్నది. మొత్తం 605 పోలింగ్ కేంద్రాల్లో పోలైన ఓట్లను ఒకే దగ్గర లెక్కిస్తున్నారు. 96 టేబుళ్లపై కౌంటింగ్ నిర్వహిస్తున్నారు. ఈ ఓట్ల లెక్కింపులో మొత్తం 2,800 మంది సిబ్బంది పాల్గొన్నారు. నల్లగొండ పట్టణ శివారులోగల ఎ దుప్పలపల్లి స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాములోని నాలుగు కౌంటింగ్ హాల్స్‌లో ఇవాళ ఉదయం 8 గంటల నుంచి ఓట్లను లెక్కిస్తున్నారు.ముందుగా బ్యాలెట్ బాక్సుల్లోని ఓట్లను సిబ్బంది కట్టలుగా కడుతున్నారు. మధ్యాహ్నం వరకు బండిల్స్ కట్టడం పూర్తిచేసి మధ్యాహ్నం నుంచి తొలి ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. తుది ఫలితం రావడానికి దాదాపు 36 గంటల సమయం పట్టే అవకాశం ఉన్నదని అధికారులు తెలిపారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ఏనుగు రాకేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి సహా మొత్తం 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అధికారులు కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిచందన ప్రకటించారు. 144 సెక్షన్ అమలులో ఉన్న కారణంగా పార్టీల నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఎవరూ కౌంటింగ్ కేంద్రం దగ్గర గుమికూడవద్దని ఎస్పీ చందన దీప్తి ఆదేశించారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు అందరూ సహకరించాలన్నారు. నాలుగు కౌంటింగ్ హాల్స్‌లో ఒక్కో హాల్‌లో 24 టేబుళ్ల చొప్పున మొత్తం 96 టేబుళ్లపై ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతున్నది. సిబ్బంది 25 బ్యాలెట్ పేపర్లను ఒక కట్టగా కడుతున్నారు. పోస్టల్ బ్యాలెట్లను కూడా వీటితో కలిపే లెక్కిస్తారు. బండిల్‌లు కట్టడం పూర్తయిన తర్వాత లెక్కింపు తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు మొదలుకానుంది. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి కూడా ఏ అభ్యర్థికి గెలుపు కోటా ఓట్లు రాకపోతే ఎలిమినేషన్ ప్రక్రియను మొదలుపెడతారు. తొలి ప్రాధాన్యత ఓట్లలో అతి తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థి నుంచి ఎలిమినేషన్ రౌండ్‌ను ప్రారంభిస్తారు. ఆయనకు బ్యాలెట్‌లో పడిన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను ఆయా అభ్యర్థుల వారీగా పంచుతూ వస్తారు. ఇలా ఒక్కో అభ్యర్థిని కింది నుంచి పైకి ఎలిమినేట్ చేస్తూ కౌంటింగ్ కొనసాగిస్తారు. ఈ క్రమంలో ఏ అభ్యర్థికైనా గెలుపు కోటా ఓట్లు వస్తే అక్కడితో కౌంటింగ్‌ను నిలిపివేసి విజేతను ప్రకటిస్తారు. అయితే మొత్తం 52 మంది బరిలో ఉండడంతో ఎలిమినేషన్ ప్రక్రియ సుదీర్ఘంగా కొనసాగే అవకాశం ఉంది. కిందటిసారి ఎలిమినేషన్ రౌండ్‌కే 44 గంటల సమయం పట్టింది. ద్వితీయ ప్రాధాన్యత ఓట్లలోనూ విజేత తేలకపోతే తృతీయ ప్రాధాన్యత ఓట్లను కూడా లెక్కించనున్నారు. కానీ ఇంతవరకు తృతీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు జరిగిన దాఖలాలు లేవనే చెప్పవచ్చు.

## మేం ఎన్డీయేలోనే ఉన్నాం.. భేటీకి హాజరవుతున్నాం: చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు స్పందించారు. బుధవారం ఉదయం ఉండవల్లిలోని తన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ మేరకు కూటమిని గెలిపించిన రాష్ట్ర ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు చెప్పారు. రాజకీయాల్లో ఎవరూ శాశ్వతం కాదని.. దేశం శాశ్వతమన్నారు. పార్టీలు సక్రమంగా పనిచేస్తే ప్రజలు మళ్లీ ఆదరిస్తారన్నారు. ఇంత చరిత్రాత్మకమైన ఎన్నికలు ఎన్నడూ చూడలేదన్నారు. పార్టీ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఎన్నికలని సంతోషం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు 1983లో 200 సీట్లు వచ్చాయని గుర్తు చేశారు. అప్పటి నుంచి మళ్లీ ఇప్పుడే ఊహించని విధంగా ఫలితాలు వచ్చాయని తెలిపారు. ఈ మేరకు మీడియా సహా ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసమే కూటమిగా ఏర్పడి ఓ స్ఫూర్తితోటి పనిచేసినట్లు చంద్రబాబు చెప్పారు. గత 40 ఏళ్లలో దేశంలో ఎన్నో రాజకీయ మార్పులను చూసినట్లు చెప్పారు. ప్రస్తుతం ఎన్డీయే కూటమితోనే ఉన్నట్లు ఈ సందర్భంగా చంద్రబాబు స్పష్టం చేశారు. 'మేం ఎన్డీయేలో ఉన్నాం. భేటీకి హాజరవుతున్నాం. ఇందులో వేరే ఆలోచనకు తావులేదు' అని చంద్రబాబు స్పష్టం చేశారు.





## ఒకే ఫ్లైట్‌లో ఢిల్లీకి ఎన్డీయే ఇండియా కూటమి నేతలు!

లోక్ సభ ఎన్నికల ఫలితాల తర్వాత ఎన్డీయే కూటమిలో జేడీయూ అధినేత నితీశ్ కుమార్, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కీ రోల్ పోషించబోతున్నారు. బీజేపీకి సొంతంగా మెజారిటీ రాకపోవడంతో చంద్రబాబు, నితీశ్ లు కింగ్ మేకర్లుగా మారిపోయారు. కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయటానికి ఈ నేతల మద్దతు కమలం పార్టీకి తప్పనిసరి అయింది. కాగా, ఎన్నికల ముందు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిలో ఈ నేతలు ఇద్దరూ చేరారు. తొలుత ఇండియా కూటమిలో కీలకంగా వ్యవహరించిన నితీశ్ కుమార్.. లాస్ట్ మినిట్ లో ఎన్డీయే గూటికి జంప్ అయ్యారు. ఈ క్రమంలో కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుతో పాటు ఇతర అంశాలపై చర్చించేందుకు ఇటు ఎన్డీఏ, అటు ఇండియా కూటమి సమావేశాలను ఏర్పాటు చేస్తుంది.




## 5జీ స్పెక్ట్రమ్ వేలం మళ్లీ వాయిదా

టెలికాం రంగం ప్రతిష్ఠాత్మకంగా భావించే 5జీ స్పెక్ట్రమ్ వేలం మరోసారి వాయిదా పడింది. జూన్ 25న ఆక్షన్ నిర్వహించనున్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్ వెల్లడించింది. కాగా మే 20న జరగాల్సిన ఆక్షన్ ఈనెల 6కు తొలుత వాయిదా పడగా తాజాగా మరోసారి డేట్ మారింది. జూన్ 13, 14 తేదీల్లో మాక్ ఆక్షన్స్ నిర్వహించనున్నట్లు తెలిపింది. కాగా రూ.96వేలకోట్ల బేస్ ప్రైస్‌తో పలు 5జీ బ్యాండ్‌లకు వేలం జరగనుంది.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4 PM



# ఏపీ ఎన్నికలు.. భారీ మెజార్టీలు ఇవే

| | |
|---|---|
| గాజువాక- పల్లా శ్రీనివాస్(TDP) | 95,235 |
| భీమిలి-గంటా శ్రీనివాస్(TDP) | 92,401 |
| మంగళగిరి- లోకేశ్(TDP) | 91,413 |
| పెందుర్తి- రమేశ్(JSP) | 81,870 |
| నెల్లూరు(U)-నారాయణ(TDP) | 72,489 |
| తణుకు- రాధాకృష్ణ(TDP) | 72,121 |
| కాకినాడ.R- నానాజీ(JSP) | 72,040 |
| రాజమండ్రి(U)- శ్రీనివాస్(TDP) | 71,404 |
| పిఠాపురం- పవన్ కళ్యాణ్(JSP) | 70,279 |



# తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక మెజారిటీ(ఎంపీ) వీరికే

| | |
|---|---|
| కుందూర్ రఘువీర్(నల్గొండ-కాంగ్రెస్) | 5,59,905 |
| శ్రీభరత్(వైజాగ్-టీడీపీ) | 5,04,247 |
| రఘురాం రెడ్డి(ఖమ్మం-కాంగ్రెస్) | 4,67,847 |
| ఈటల రాజేందర్(మల్కాజిగిరి-బీజేపీ) | 3,91,475 |
| బలరాం నాయక్(మహబూబాబాద్-కాంగ్రెస్) | 3,49,165 |
| గుంటూరు(చంద్రశేఖర్ పెమ్మసాని-టీడీపీ) | 3,44,695 |
| హరీశ్(అమలాపురం-టీడీపీ) | 3,42,196 |
| అసదుద్దీన్ ఒవైసీ(హైదరాబాద్-MIM) | 3,38,087 |
| రామ్మోహన్ నాయుడు(శ్రీకాకుళం-టీడీపీ) | 3,27,901 |

# బీఆర్ఎస్‌ను బీజేపీకి తాకట్టు పెట్టిన కేసీఆర్

**బీఆర్ఎస్ చేసిన కుట్రతోనే కాంగ్రెస్ 8 చోట్ల ఓడిపోడింది**
**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

వంద రోజుల కాంగ్రెస్ పాలనకు ప్రజలు పట్టం కట్టారని, మమ్మల్ని ఆశీర్వదించిన తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. బుధవారం ఆయన నివాసం వద్ద ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల కంటే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓట్ల శాతం పెరిగిందని, తమ రెఫరెండంకు ప్రజలు మద్దతు తెలిపారన్నారు. కాంగ్రెస్ గెలుపు కోసం పోరాడిన కార్యకర్తలకు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. కార్యకర్తలు తమ గౌరవాన్ని నిలబెట్టారన్నారు. బీజేపీ కోసం బీఆర్ఎస్ నాయకులు అవయవదానం చేసారని, బీజేపీ గెలుపు కోసం బీఆర్ఎస్ నాయకులు ఎంతో కృషి చేశారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆత్మ బలిదానం చేసుకుందన్నారు. 7 నియోజక వర్గాల్లో బీఆర్ఎస్ డిపాజిట్ కోల్పోయిందని, పార్టీ పెట్టినప్పటి నుంచి బీఆర్ఎస్ పార్టీకి సిద్దిపేటలో మెజారిటీ వచ్చిందని, సిద్దిపేటలో హరీష్ రావుకు పూర్తి పట్టున్నప్పటికీ తమ ఓట్లు బీజేపీకి వేయించారని, బీఆర్ఎస్ చేసిన కుట్రతోనే కాంగ్రెస్ 8 చోట్ల ఓడిపోడిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. మోదీ గ్యారంటీకి ఉన్న వారంటీ అయిపోయిందని, ఆయన కాలం చెల్లిపోయిందని, మోదీ చరిష్మాతో ఎన్నికలకు వెళ్లిన ఎన్డీయే కూటమికి ప్రజలు బుద్ధి



చెప్పారని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజలు తిరస్కరించిన మోదీ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆయనకు విలువలు ఉంటే ప్రధాని పదవి నుండి హుందాగా తప్పుకోవాలన్నారు. ఈరోజు నుంచి మరో రెండు గంటలు అదనంగా పని చేస్తామని, రాష్ట్రంలో ఏ సీటు గెలిచినా, ఏ సీటు ఓడినా తనదే బాధ్యత అని రేవంత్ రెడ్డి అన్నారు. గెలుపు ఓటములు తానే బాధ్యత తీసుకుంటానని స్పష్టం చేశారు.

# 2024 ఎన్నికల్లో ఓటమి పాలైన కేంద్ర మంత్రులు వీళ్లే..

బీజేపీలో అగ్ర నేతలు, కేంద్ర మంత్రులైన స్మృతి ఇరానీ, అర్జున్ ముండా, అజయ్ మిశ్రా తేనీలు.. తాజాగా ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. అమేథీ నుంచి కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ పరాజయం పాలయ్యారు. 2019లో ఇదే స్థానం నుంచి రాహుల్ గాంధీపై విజయం సాధించిన ఆమె ఈసారి అనూహ్య రీతిలో ఓడిపోయారు. కాంగ్రెస్ అభ్యర్థి కిశోరీ లాల్ శర్మ ఆమెపై గెలుపొందారు. సుమారు 1,67,196 ఓట్ల తేడాతో ఆయన విక్టరీ కొట్టారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రిగా చేసిన అజయ్ మిశ్రా తేని కూడా ఓడిపోయారు. లకింపుర్ ఖేరి ఘటన వివాదంలో ఆయన ఇరుక్కున్న విషయం తెలిసిందే. సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి ఉత్కర్ష్ వర్మ చేతిలో ఆయన 34 వేల ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి అర్జున్ ముండా కూడా దారుణ ఓటమి చవిచూశారు. జార్ఖండ్‌లోని కుంటి నియోజకవర్గం నుంచి ఆయన పోటీ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి కాళీచరణ్ ముండా చేతిలో 1,49,675 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ సహాయ మంత్రి కైలాశ్ చౌదరీ ..రాజస్తాన్‌లోని బార్మర్ నుంచి ఓడిపోయారు. ఆయన ఆ స్థానంలో మూడవ ప్లేస్‌లో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి ఉమ్మెడ రామ్ బెనివాల్ 4.48 లక్షల ఓట్ల తేడాతో కైలాశ్‌పై గెలిచారు. కేరళలోని తిరువనంతపురం నుంచి పోటీ చేసిన ఎలక్ట్రానిక్స్, ఐటీశాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ కూడా ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ దిగ్గజ నేత శశిథరూర్.. చేతిలో



16వేల ఓట్ల తేడాతో రాజీవ్ చంద్రశేఖర్ పరాజయం చెందారు. భారీ పరిశ్రమల మంత్రి మహేంద్ర నాథ్ పాండే .. యూపీలోని చండౌలీ సీటు నుంచి ఓటమి పాలయ్యారు. హౌజింగ్, అర్బన్ అఫైర్స్ శాఖ మంత్రి కౌశల్ కిషోర్ కూడా ఓటమి చెందారు. మోహన్‌లాల్‌గంజ్ నియోజకవర్గం నుంచి సమాజ్‌వాదీ నేత ఆర్కే చౌదరి 70వేల ఓట్ల తేడాతో గెలుపొందారు. కన్జ్యూమర్ అఫైర్స్, ఫుడ్, పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ శాఖ సహాయ మంత్రి సాధ్వీ నిరంజన్ జ్యోతి యూపీలోని ఫతేపుర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. రైల్వేశాక సహాయ మంత్రి రావు సాహెబ్ దాన్వే .. మహారాష్ట్రలోని జాల్నా సీటు నుంచి ఓటమి చెందారు. క్యాబినెట్ మంత్రి ఆర్కే సింగ్.. బీహార్‌లోని ఆరా సీటు నుంచి ఓటమి పాలయ్యారు. కేంద్ర మంత్రి సంజీవ్ బాల్యన్.. ముజాఫర్‌నగర్ లోక్‌సభ సీటు నుంచి ఓడిపోయారు. అక్కడ ఎస్పీ నేత హరీంద్ర సింగ్ మాలిక్ 24 వేల ఓట్ల తేడాతో విజయం సాధించారు. విదేశాంగ శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వీ మురళీధరన్ కూడా ఓడిపోయారు. ఫిషరీస్, యానియల్ హజ్‌బెండరీ, డెయిరీ శాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్ కూడా ఓటమి పాలయ్యారు. డీఎంకే నేత ఏ రాజా చేతిలో ఆయన రెండు లక్షల ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. హోంశాఖ సహాయ మంత్రి నిషిత్ ప్రామానిక్.. బెంగాల్‌లోని కూచ్ బిహార్ నుంచి ఓడిపోయారు. అక్కడ టీఎంసీ నేత జగదీశ్ చంద్ర బాసునియా 39వేల ఓట్ల తేడాతో విజయం సాధించారు. విద్యాశాఖ సహాయ మంత్రి సుభాష్ సర్కార్.. బంకురా లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఓడిపోయారు. టీఎంసీ నేత అరూప్ చక్రవర్తి 32 వేల ఓట్ల తేడాతో విజయం సాధించారు.



# కాబోయే సీఎం చంద్రబాబును కలిసిన ఏపీ డీజీపీ

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. దీంతో టీడీపీ చీఫ్ మరోసారి ఏపీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు నివాసం సందడిగా మారింది. పార్టీ నేతలు, అనుచరులు, కార్యకర్తలతో పాటు అధికారులు ఆయన నివాసానికి క్యూ కడుతున్నారు. చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు చెబుతున్నారు. తాజాగా ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా చంద్రబాబును కలుసుకున్నారు. పార్టీ విజయం నేపథ్యంలో టీడీపీ చీఫ్ కు శుభాకాంక్షలు తెలిపారు. లోక్ సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి మెజారిటీ సీట్లు సాధించడంతో తదుపరి కార్యాచరణ కోసం బుధవారం మధ్యాహ్నం ఢిల్లీలో సమావేశం ఏర్పాటు చేసింది. ఈ మీటింగ్ లో పాల్గొనేందుకు టీడీపీ చీఫ్ చంద్రబాబు, జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ మరికాసేపట్లో ఢిల్లీకి బయలుదేరనున్నారు. ఎన్డీఏ కూటమిలో చంద్రబాబు కీలకంగా మారిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో చంద్రబాబు ఢిల్లీ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.




# భారత యువ ఎంపీలు వీళ్లే.. 25 ఏళ్లకే పార్లమెంట్‌కు ఎంట్రీ

తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నలుగురు యువ ఎంపీలు గా ఎన్నికయ్యారు. ఆ నలుగురు ఎంపీల వయసు 25 ఏళ్లు మాత్రమే ఉంది. పుష్పేంద్ర సరోజ్, ప్రియా సరోజ్.. సమాజ్‌వాదీ పార్టీ టికెట్‌పై గెలుపొందగా, శాంభవి చౌదరీ, సంజన జాతవ్.. లోక్‌జనశక్తి, కాంగ్రెస్ పార్టీ టికెట్లపై విజయం నమోదు చేశారు.శాంభవి చౌదరీ.. బీహార్ నుంచి విక్టరీ సాధించారు.నితీశ్ కుమార్ క్యాబినెట్‌లో మంత్రిగా ఉన్న అశోక్ చౌదరీ కుమార్తె ఆమె. సమస్తిపుర్ నియోజకవర్గం నుంచి శాంభవి గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థి సన్నీ హజారీపై ఆమె విక్టరీ కొట్టారు. సన్నీ హజారి కూడా ఓ మంత్రి కుమారుడు. ఎన్డీఏ ప్రచారం సమయంలో.. శాంభవి యువ అభ్యర్థి అని ప్రధాని మోదీ కొనియాడారు.



# జూన్ 10న కల్కి ట్రైలర్



పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా భారీ తారాగణం యూనివర్సల్ హీరో కమల్ హాసన్ అలాగే అమితాబ్ బచ్చన్ లు కీలక పాత్రల్లో దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన ప్రైడ్ ఇండియన్ చిత్రం "కల్కి 2898 ఎడి" కూడా ఒకటి. మరి మేకర్స్ ఈరోజు ఓ బిగ్గెస్ట్ అప్డేట్ ని అందిస్తున్నట్టుగా అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. దీనితో ఇది ట్రైలర్ కోసమే అన్నట్టుగా టాక్ వచ్చింది. మరి ఈ సినిమా నుంచి అనుకున్నట్టుగానే ట్రైలర్ రిలీజ్ కి వచ్చేసింది. ఈ సినిమా అవైటెడ్ ట్రైలర్ కట్ ని ఈ జూన్ 10న విడుదల చేస్తున్నట్టుగా మేకర్స్ అనౌన్స్ చేసేసారు.

# శాన్వి శ్రీవాస్తవ గ్లామర్ షో

శాన్వి శ్రీవాత్సవ.. ఈ పేరుకు కొత్తగా పరిచయం అవసరం లేదు. లవ్లీ సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది ఈ ముద్దుగుమ్మ. ఆ సినిమా బాగానే ఆడినా కూడా తెలుగులో గుర్తింపు మాత్రం తెచ్చుకోలేకపోయింది. అయితే పక్కనున్న కన్నడలో మాత్రం సంచలనాలు సృష్టిస్తుంది ఈ భామ. అక్కడ స్టార్ హీరోలతో నటిస్తూ రప్ఫాడిస్తుంది. సినిమా ఇండస్ట్రీలో చాలా కాలం పాటు అగ్ర హీరోయిన్ గా కొనసాగాలి అంటే అంత సాధారణమైన విషయం కాదు. పోటీలో చాలామంది బ్యూటీలు వస్తూ ఉంటారు వెళుతూ ఉంటారు. ఆ తర్వాత నుంచి ఆమె తెలుగు సినీ పరిశ్రమలో కనిపించట్లేదు. కేవలం కన్నడ సినిమాలు మాత్రమే చేస్తోంది. అయినప్పటికీ సోషల్ మీడియాల ద్వారా తెలుగు అభిమానులకు చాలా దగ్గరగా ఉంటోంది.



# ఈ రాష్ట్రాలే '400 పార్' కలను చెదరగొట్టాయా?

ఎన్డీఏ 293 సీట్లకే పరిమితం కావడం వెనుక యూపీ, మహారాష్ట్ర, బెంగాల్, బిహార్ రాష్ట్రాల ప్రభావం ఉందంటున్నారు విశ్లేషకులు. యూపీలో 80 సీట్లూ క్లీన్ స్వీప్ చేస్తామని ఆశించిన బీజేపీకి 36 సీట్లే వచ్చాయి. మహారాష్ట్రలో 2019లో 48లో 41 సీట్లు సాధించిన ఎన్డీఏ ఈసారి 17 సీట్లకు పరిమితమైంది. బెంగాల్‌లో టీఎంసీ దెబ్బకు బీజేపీ 12 సీట్లకే చతికిలపడింది. బిహార్‌లోనూ ఎన్డీఏ 2019తో పోలిస్తే తొమ్మిది సీట్లు కోల్పోయి 39కి పరిమితమైంది.

**మోదీ 3.0 @292**

'400 పార్..' ఆశించిన ఎన్డీఏకి ఓటర్లు 292 సీట్లతో సరిపెట్టారు. మెజార్టీ మార్క్ అయిన 272 దాటడంతో త్వరలోనే ఎన్డీఏ కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. లెక్కింపులో భాగంగా ఓ దశలో ఎన్డీఏ 300 స్థానాల్లో ఆధిక్యం సంపాదించినా ఇండియా కూటమి ఎన్డీఏ జోరుకు బ్రేకులు వేసింది. మరోవైపు 295 సీట్లు వస్తాయని ఆశించిన ఇండియా కూటమికి 234 సీట్లు దక్కాయి. దీంతో పాటు 17 స్థానాల్లో ఇతరులు గెలుపొందారు.




# కొనసాగుతున్న మోదీ 2.0 కేబినెట్ చివరి భేటీ

కేంద్ర కేబినెట్ చివరి సమావేశం ఢిల్లీలో జరుగుతోంది. ఈ సమావేశంలో ఎన్డీఏ 3.0 ప్రభుత్వ ఏర్పాటుపై చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. మోదీ 2.0 ప్రభుత్వానికి ఇదే చివరి కేబినెట్ సమావేశం. ఈ సమావేశంలో ప్రధాని మోదీ తన రాజీనామాపై నిర్ణయం తీసుకోనున్నారు. కాగా, ఇవాళ సాయంత్రమే ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల భేటీ కూడా జరగనుంది. ఈ భేటీలో కొత్త ప్రభుత్వ కూర్పు, ఫ్రెండ్లీ పార్టీలకు మంత్రిపదవులు, ప్రభుత్వ కామన్ ఎజెండా తదితర అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. మరోవైపు భవిష్యత్తు కార్యాచరణపైర్చించేందుకు ఇండియా కూటమి నేతలు కూడా సాయంత్రమే సమావేశమవనున్నారు.